# ఉత్సవ శోభితం అలంకారోత్సవం

- అలంకార ప్రియుడిగా కురుమూర్తిరాయుడు
- అంబరాన్నంటిన స్వర్ణాభరణాల ఊరేగింపు
- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆత్మకూరు
- ఆభరణాల ధగధగతో పులకించిన కాంచనగుహ
- కనులపండువగా కురుమూర్తి బ్రహ్మోత్సవాలు
- పూజలు చేసిన ఎమ్మెల్యేలు చిట్టెం, ఆల



ఆత్మకూరులో డోలు కొడుతున్న మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట)/ఆత్మకూరు/అమరచింత, నవంబర్ 18 : పేదల తిరుపతిగా ప్రఖ్యాతిగాంచిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అలంకార మహోత్సవం శనివారం కన్నులపండుగగా సాగింది. ఆత్మకూరు మున్సిపల్ పాలకవర్గం నేతృత్వంలో స్వర్ణాభరణాల ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎస్‌బీఐలో భద్రపరిచిన స్వామివారి స్వర్ణాభరణాలను ఆచార వ్యవహారాలతో ఆనవాయితీ ప్రకారం ఊరేగించి కురుమతి కొండకు తరలించారు. ముందుగా బ్యాంకు మేనేజర్ అబ్బాస్‌అలీ, అసిస్టెంట్ మేనేజర్ స్వాతి, క్షేత్ర అధికారులు మదన్, లోకేశ్ సమక్షంలో దేవస్థానం కార్యనిర్వాహక అధికారి మదనేశ్వర్‌రెడ్డి, మండలి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి స్థానిక విశ్వకర్మ ప్రతినిధులు బ్యాంకు లాకర్ నుంచి స్వర్ణాభరణాల పెట్టెను బయటకు తీశారు. అనంతరం మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దంపతులతో పాటు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, జలంధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, వర్కటం జగన్నాథ్‌రెడ్డి వేదపండితుల నేతృత్వంలో స్వర్ణాభరణాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం గాడి వంశస్తులైన లక్ష్మీనారాయణ ఆభరణాల పెట్టెను తలపై పెట్టుకొని ఊరేగింపును ప్రారంభించారు. సాంప్రదాయ వాయిద్యం, కుర్వడోళ్లు, బాజాభజంత్రీలు, మేళతాళాలు, డీజే సౌండ్స్‌ల హోరు, శివసత్తుల పూనకాలు, భారీ టపాసుల మోతతో పట్టణం దద్దరిల్లింది. ఊరేగింపు పొడవునా వేలాదిగా భక్తులు స్వామివారి స్వర్ణాభరణాలను తాకి మొక్కేందుకు పోటీపడ్డారు. దారిపొడవునా పువ్వుల వర్షం కురిపిస్తూ భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. కేరళ కళాకారులతో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాయిద్యం అందరినీ ఆకట్టుకున్నది. భక్తజనుల సౌకర్యం కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బ్యాంకు బయట డిజిటల్ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. నాయకులు, యువకులు నృత్యాలు చేస్తూ హర్షం ప్రకటించారు. పట్టణ శివారులోని పరమేశ్వరస్వామి చెరువుకట్టపై పరమేశ్వరుడి ఆలయానికి అభిముఖంగా ఎమ్మెల్యే దంపతులు పూజలు నిర్వహించి స్వర్ణాభరణాలను పట్టణం నుంచి సాగనంపారు. ఊరేగింపు పొడవునా సీఐ కేఎస్ రత్నం, ఎస్సై శ్రీహరి నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కాగా, ప్రస్తుత ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గంలో పోటీచేస్తున్న ప్రధాన అభ్యర్థులు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, జలంధర్‌రెడ్డి, వర్కటం జగన్నాథ్‌రెడ్డి బ్యాంకు ఆవరణలో ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని అభివాదాలు తెలుపుకున్నారు. అలాగే స్వర్ణమ్మ, సీతమ్మ, రామన్న, శ్రీహరిలు ఒకరికొక్కరు పలుకరించుకున్నారు. ఎమ్మెల్యే ఆలతో పాటు ఆలయ పాలక మండలి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రీయాదవ్, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రాజు, కార్యనిర్వహణాధికారి మదనేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, పీఏసీసీఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ శివరంజని, రవికుమార్‌యాదవ్,తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



అమ్మాపూర్‌లో ఆభరణాలతో వస్తున్న ఎమ్మెల్యే ఆల



పట్టువస్త్రాలను కురుమూర్తిస్వామి ఆలయానికి తరలిస్తున్న పద్మశాలీ కులస్తులు



ఊరేగింపులో భారీగా పాల్గొన్న భక్తులు

### కురుమూర్తిస్వామికి పట్టువస్త్రాలు..

అమరచింత, నవంబర్ 18 : పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన ఉద్దాల ఉత్సవానికి శనివారం పట్టణంలోని పద్మశాలీ కుల బంధువులు భక్తమార్కేండయస్వామి ఆలయం నుంచి కురుమూర్తి స్వామి సన్నిధికి పట్టువస్త్రాలను తరలించారు. ఏండ్లుగా ఉద్దాల ఉత్సవానికి ఇక్కడి పద్మశాలీ కులస్తులు, చేనేత కార్మికులు పట్టువస్త్రాలను తయారు చేయడం అనవాయితీగా వస్తున్నది. కార్యక్రమంలో చేనేత కార్మికులు దేవరకొండ లచ్చన్న, పారుపల్లి సోములు, పారుపల్లి వెంకటేశ్, మోహన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### స్వామివారికి అశ్వవాహన సేవ..

అర్చకులు స్వామివారిని ప్రత్యేక అలంకరణతో వేదమంత్రోచ్చరణలతో గోవిందనామ భజనల మధ్య అత్యంత వైభవంగా అశ్వవాహనంలో ఊరేగింపు సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాల వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలు తిలకించడానికి రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు తరలివస్తారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా 250 మంది పోలీసులతో బందోబస్తు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# జల పరవశం

- మార్కండేయ పంపు-1 ప్రారంభం
- రూ.77 కోట్లతో లిఫ్ట్ నిర్మాణ పనులు
- 7,310 ఎకరాలకు సాగునీరే లక్ష్యం
- ఐదు గ్రామాలు, 17 తండాలు సస్యశ్యామలం
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే మర్రి
- బిజినేపల్లి, ఖిల్లా మండలాల రైతుల్లో ఆనందం



రిజర్వాయర్ పంప్‌హౌస్

బిజినేపల్లి, నవంబర్ 18 : ఐదు గ్రామాలు.. 17 తండాలు.. 7,310 ఎకరాలకు సాగునీరందించే మార్కండేయ రిజర్వాయర్ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. రెండు పంపు పనులు పూర్తి కాగా, ఒక పంపును శుక్రవారం రాత్రి ఎస్‌ఈ ఏఎస్‌ఎన్ రెడ్డి, ఏఈ శివరాంలు డ్రైరన్ చేశారు. దీంతో మండలంలోని కేఎల్‌ఐ కాల్వ ద్వారా నీరు అందని 5 గ్రామాలు, 17 తండాలు సస్యశ్యామలం కానున్నాయి. మొత్తం ఈ లిఫ్ట్ కింద 7,310 ఎకరాలకు సారునీరు పుష్కలంగా అందనున్నది. రైతుల పొలాలకు నీరందక సతమతమవుతున్న తరుణంలో 2022 సంవత్సరంలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ మార్కండేయ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్ పనులు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆరు నెలల్లో పూర్తిచేస్తామని చెప్పగా, కొంత ఆలస్యం జరిగినప్పటికీ ఏడు నెలలకాలంలో లిఫ్ట్ పనులు పూర్తి చేసి నీటిని అందించేందుకు ఏర్పాట్లు చేశారు. గత పాలకులు కేఎల్‌ఐ కాల్వను బిజినేపల్లి మండలంలో కిలోమీటర్ల మేర తీసుకెళ్లారు. కానీ కాల్వ పైభాగం ఎత్తు ప్రాంతంలో ఉన్న పంట పొలాలకు నీరందించలేకపోయారు. దీంతో నాటి నుంచి నేటి వరకు పక్కనే కృష్ణమ్మ నీరుపారుతున్నా పంటలకు సాగునీరు అందక రైతులు గోసపడేవారు. కేవలం వర్షాధార పంటలను మాత్రమే పండించుకునేవారు. మిగిలిన గ్రామాలు, తండాల రైతులు పొలాలకు నీరు అందించాలనే ఉద్దేశ్యంతో పట్టువీడని విక్రమార్కుడిగా ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌తో కొట్లాడి కొత్తగా మార్కండేయ రిజర్వాయర్‌ను మంజూరు చేయించారు. ఈ రిజర్వాయర్ మొదట 130 ఎకరాల్లో ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా, రాష్ట్ర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేవలం ఏడు ఎకరాల నష్టంతో ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. ఇదిలా ఉండగా, బిజినేపల్లి మండలంలోని శాయిన్‌పల్లి గ్రామం కేఎల్‌ఐ కాల్వ 22.7 కిలోమీటర్ల వద్ద మోటర్లను ఏర్పాటు చేసి లిఫ్ట్ ద్వారా మండలంలోని కీమ్యాతండా సమీపంలో సింహారెడ్డి కుంటను అర టీఎంసీ సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మించారు. అంతేకాకుండా గ్రావిటీ కెనాల్ కిలోమీటర్ మేర పూర్తయ్యింది. ఈ రిజర్వాయర్‌ను కృష్ణమ్మ నీటితో నింపి మండలంలోని శాయిన్‌పల్లి, పోలేపల్లి అనే రెండు కుడి, ఎడమ కాల్వల ద్వారా పంట పొలాలకు సాగునీటిని అందించనున్నారు. కాగా, ఈ రిజర్వాయర్‌కు మూడు కిలోమీటర్ల మేర పైపులైన్, రెండు కిలోమీటర్ల మేర ఓపెన్ కెనాల్ పనులు పూర్తికాగా, పైప్‌లైన్ కాల్వ పనులు చేపట్టనున్నారు. దీంతో రిజర్వాయర్ పనులు పూర్తవడంతో చుట్టుపక్కల గ్రామాలు, తండాలు సస్యశ్యామలం కానున్నాయి. ఎన్నో ఏండ్లుగా పంటల సాగునీటికోసం ఎదురుచూసిన రైతుల కల నెరవేరింది. బీడుభూములు కృష్ణాజలాలతో తడవడం ద్వారా వలసలు తగ్గి ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

### గ్రామాలు, తండాలు సస్యశ్యామలం..

మార్కండేయ రిజర్వాయర్ బిజినేపల్లి మండలంలోని శాయిన్‌పల్లి, గంగారం, లట్టుపల్లి, మమ్మాయిపల్లి, పోలేపల్లి ఇలా ఐదు గ్రామాలతో పాటు వసురాంతండా, పెద్దతండా, కేతరిబండ తండా, కీమ్యాతండా, పెద్ద హేమ్లాతండా, ఎర్రకుంట తండా, అలుగుతండా, బద్యానాయక్ తండా, ఇప్పలతండా, రావులచెరువుతండా, బొడుసుగడ్డ తండా, చిన్నపీర్ తండా, పీర్యా తండా, ఫుల్‌సింగ్‌తండా, భీముని తండా, కాట్రావత్ తండా, నల్లగడ్డ తండా, శాయిన్‌పల్లి తండాలతోపాటు వనపర్తి జిల్లాలోని ఖిల్లాఘనపురం మండలంలోగల సోలీపూర్, జంగమాయిపల్లి, రుక్కన్నపల్లి, షాపూర్, కర్నెతండా, దొంతిగుంట తండా, ఆమోదంబండ తండా, గరయ్యబండ తండా, కుంటముందరి తండా, పోతులకుంట తండా, ఎర్రగడ్డ తండా, ఫామ్‌రెడ్డిపల్లి తండా ఇలా మూడు గ్రామాలు, ఎనిమిది తండాలకు సాగునీరు అంది పంటపొలాలు సస్యశ్యామలం కానున్నాయి. కాగా ఇదివరకే కెఎల్‌ఐ కాల్వ ద్వారా లక్షకుపైగా ఎకరాలకు సాగునీరు అందుతున్న విషయం తెలిసిందే. మార్కండేయ రిజర్వాయర్ ద్వారా 8వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందనున్నది. దీంతో పల్లెలు, తండాలు అభివృద్ధి చెందడంతోపాటు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కేఎల్‌ఐ ద్వారా వచ్చిన నీటిని మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరణ చేసిన చెరువు కుంటల్లో నింపి పంటలను పండించడం జరుగుతుంది. ప్రధానంగా మండలంలోని వడ్డెమాన్, ఖానాపూర్, పాలెం, పెద్దచెరువులతోపాటు తదితర గ్రామాలు తండాల్లో ఉన్న కుంటల్లో నీటిని నింపి పంటల సాగుకు అందించనున్నారు. ఇదేగాక గతంలో కంటే సాగు పెరగనున్నది. గతంలోకంటే చెరువు కుంటల్లో నీరు పుష్కలంగా ఉండడంతో చేపలను పెంచుకొని విక్రయిస్తూ మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందనున్నారు.

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా..



మండలంలోని 5 గ్రామాలు, 17 తండాలకు కేఎల్ఐ నీరు రాకపోవడంతో ఆరు నెలల్లో మార్కెండేయ రిజర్వాయర్ పూర్తి చేసి నీరు అందిస్తానని మాట ఇచ్చా. ఆ మేరకు మోటారు రన్ చేసి రిజర్వాయర్‌కు నీటిని నింపుతున్నాం. కేఎల్ఐ కాల్వకు ఎగువ ప్రాంతంలో ఈ గ్రామాలు ఉండడం వల్ల గత పాలకులు పంట పొలాలకు నీటిని అందించలేకపోయారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం కేసీఆర్‌తో మాట్లాడి రూ.80కోట్ల వ్యయంతో రిజర్వాయర్‌ను మంజూరు చేయించా. కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 2022లో మంత్రి కేటీఆర్ రిజర్వాయర్ పనులను ప్రారంభించారు. తక్కువ భూమిని రైతులు కోల్పోయేలా ఎక్కువ సమయం తీసుకొని డిజైన్ చేసి రిజర్వాయర్ పూర్తి చేశాం. రిజర్వాయర్ పూర్తి కావడంతో బీడుగా ఉన్న భూములు సస్యశ్యామలం కానున్నాయి.

-మర్రి జనార్దన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే